# బీఆర్ఎస్ ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం

- స్వపరిపాలనలోనే జీవన ప్రమాణాలు మెరుగు
- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం
- పారిశ్రామిక రంగంలో భారీ పెట్టుబడులు
- సమైక్య పాలనలో అన్ని రంగాల్లో నిర్లక్ష్యం
- మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి


ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి

తెలంగాణచౌక్, నవంబర్ 3: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు పెరిగాయని, గత ప్రభుత్వాలు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి చొరవ చూపలేదని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమస్యలను పరిష్కరించారని మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌భవన్‌లో శుక్రవారం పీఆర్టీయూ మాజీ అసోసియేషన్ అధ్యక్షుడు వీరమల్ల నర్సింగరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు తెలంగాణను అన్ని రంగాల్లో నిర్లక్ష్యం చేశాయని వాపోయారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ హయంలో అద్భుత పాలన కొనసాగుతుందని కొనియాడారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఎన్నో ఏండ్లుగా తాగు నీటి కోసం గోస పడుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలకు మిషన్ భగీరథ ప్రాజెక్టుతో ఇంటింటికీ తాగునీటిని అందించారన్నారు. పారిశ్రామిక రంగాల్లో దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించారని చెప్పారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా సూపర్ న్యూమరీ పోస్టులతో సొంత జిల్లాలకు కేటాయించడానికి ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. 398 వేతనంతో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నేషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి, వారి సమస్యను ప్రభుత్వం పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని మూడు డీఏలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్‌కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మద్దతు ఇచ్చి మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పచ్చని తెలంగాణను ఆగం చేయద్దు

- ఢిల్లీ పార్టీల చేతుల్లో పెట్టి మోసపోవద్దు
- బీఆర్ఎస్ పాలనలో స్వేచ్ఛగా వ్యాపారాలు
- వ్యాపార, వాణిజ్యవర్గాలకు అండగా కేసీఆర్
- ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- పట్టణ వ్యాపార వర్తక సంఘాల ఆత్మీయ సమ్మేళనం


కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌ను సన్మానిస్తున్న పట్టణ వ్యాపార, వర్తక సంఘం సభ్యులు

కార్పొరేషన్, నవంబర్ 3: 'కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఇప్పుడిప్పుడే పచ్చగా మారుతుంది. ఈ సమయంలో ఢిల్లీ పార్టీల చేతుల్లో పెడితే యాభై ఏండ్లు వెనక్కి పోవాల్సి వస్తుంది. ఈ పదేండ్లలో కరీంనగర్‌లోని వ్యాపార, వాణిజ్యవర్గాలకు అన్ని విధాలుగా అండగా నిలిచాం. స్వేచ్ఛగా వ్యాపారాలు నిర్వహించుకునేలా చూశాం. కానీ మతతత్వ పార్టీ బీజేపీకి అవకాశం ఇస్తే నగరంలో శాంతిభద్రతలకు ఇబ్బందులు వస్తాయి. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేసి వృథా చేసుకోవద్దు. ఆలోచించి కారు గుర్తుకు ఓటేయ్యండి' అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక వైశ్యభవన్‌లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణ వ్యాపార వర్తక సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి హాజరైన మంత్రి గంగుల మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడా కూడ వ్యాపారులను ఇబ్బంది పెట్టేలా దందాలు, చందాలు లేకుండా పని చేశామన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించి వ్యాపార వర్గాలకు అండగా నిలిచామన్నారు. నగరంలో సాగుతున్న అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే సెక్యూలర్ ప్రభుత్వం మళ్లీ రావాలన్నారు. పదేండ్లలో నగరంలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంతో పాటుగా కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌ను ఏడాదిలోగానే పూర్తి చేస్తామని తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే విదేశాల నుంచి కూడ పర్యాటకులు వస్తారని, వ్యాపార అభివృద్ధి జరుగుతుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేస్తే ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి ఆగిపోతుందన్నారు. తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దని కోరారు. అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగాలంటే బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే కరీంనగర్‌ను అద్భుతనగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో రెండో గొప్ప నగరంగా మార్చుతామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు బొయినపల్లి నర్సింగరావు, దేవిశెట్టి రమేశ్, వంగల రమేశ్, ఎలగందుల మునీందర్, చిదుర సురేశ్, బొల్లం శ్రీనివాస్, తాటిపల్లి సుభాష్, రమేశ్, శ్రీధర్, బీఆర్ఎస్ నాయకుడు వంగల పవన్, పెద్ది రమేశ్ పాల్గొన్నారు.

## నిమినేషన్లు షురూ

- తొలిరోజు 4 దాఖలు
- కరీంనగర్‌లో 3, హుజూరాబాద్‌లో 1

కరీంనగర్/కలెక్టరేట్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం మొదలైంది. కరీంనగర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు కే మహేశ్‌కుమార్ (కరీంనగర్), ప్రఫుల్ దేశాయ్ (చొప్పదండి), కే లక్ష్మీకిరణ్ (మానకొండూర్), ఎస్ రాజు (హుజూరాబాద్) స్థానికంగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. తొలిరోజు కరీంనగర్ నుంచి 3, హుజూరాబాద్ నుంచి ఒక నామినేషన్ దాఖలైంది. ఆదివారం మినహాయిస్తే ఈ నెల 10 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రతి నామినేషన్ కేంద్రంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నామినేషన్ దాఖలుకు అభ్యర్థితోపాటు ఐదుగురిని మాత్రమే అనుమతించారు. ఎలాంటి హడావిడి లేకుండా సాదాసీదాగా నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. కాగా, ఈ నెల 10 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. అదే రోజు నామినేషన్లు పరిశీలిస్తారు. 13 వరకు నామినేషన్ల ఉప సంహరణ ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేల సత్పతి నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించారు. మానకొండూర్‌లోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు.

## జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

- స్వాగతం పలికిన డీఈవో పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 3: సాధారణ ఎన్నికల నిర్వహణ తీరు, బరిలో అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం నియమించిన వ్యయ పరిశీలకులు శుక్రవారం జిల్లాకు చేరుకున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇద్దరు ఐఏఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించగా, కరీంనగర్, చొప్పదండి అసెంబ్లీ సెగ్మెంట్లకు శివ్‌కుమార్, మానకొండూర్, హుజూరాబాద్ సగ్మెంట్లకు చిట్టే యోగేష్ సుగ్డియోకు ఎన్నికల సంఘం బాధ్యతలు అప్పగించింది. వీరు నామినేషన్ల ప్రక్రియ మొదలైన ఈనెల 3 నుంచి 10 తేదీ వరకు జిల్లాలో మకాం వేసి, పరిశీలించనున్నారు. వీరికి స్థానిక కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌజ్‌లో విడిది ఏర్పాటు చేయగా, అక్కడికి చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి వీరికి పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు.

# 'పురమల్ల' బైండోవర్‌పై కాంగ్రెస్‌లో చర్చ

- కేసుల్లో ఉన్న వ్యక్తికి టికెట్ ఇస్తారా?
- అధిష్టానానికి పలువురు నాయకుల ఫిర్యాదు
- ఇప్పటికే పార్టీ అభాసు పాలవుతుందన్న ఆందోళన



శ్రీనివాస్ భూకబ్జాలపై కరీంనగర్‌లో ఆందోళన చేస్తున్న ఆయన బాధితులు (ఫైల్)

కరీంనగర్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడు టికెట్లు అమ్ముకుంటున్నారంటూ ఇప్పటికే కాంగ్రెస్‌ను వీడిన ఎంతో మంది నాయకులు బాహాటంగా విమర్శిస్తుండగా.. కరీంనగర్ టికెట్ విషయంలో జరుగుతున్న తతంగంపై ఆ పార్టీలోని నాయకులే ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న బొమ్మకల్ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ ఇప్పటికే పలు కేసుల్లో బైండోవర్ అయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై బాహాటంగా మాట్లాడేందుకు ఇప్పటికే కొంత మంది కాంగ్రెస్ నాయకులు నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. నిజానికి అనేక కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని, ఎన్నికల నేరాలకు పాల్పడిన వారిని పోలీసులు తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసే విషయం అందరికీ తెలిసినప్పటికీ.. ఆ విషయాన్ని పక్కన పెట్టి పురమల్లకు ఒకవేళ టికెట్ కేటాయిస్తే.. ఆ ప్రభావం ఉమ్మడి జిల్లాపై పడుతుందన్న ఆందోళన పార్టీలోని శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

### 24కు పైగా కేసులు

సుదీర్ఘకాలం బొమ్మకల్ సర్పంచ్‌గా ఉన్న పురమల్ల శ్రీనివాస్‌పై అనేక భూ కబ్జాల కేసులు నమోదై ఉన్న విషయం తెలిసిందే. బెదిరింపులకు పాల్పడడం, భూముల రికార్డులు మార్చడం, అనేక భూములు తన పేరిట, తన అనుచరుల పేరిట రాయించుకోవడం, ఒకే స్థలాన్ని నలుగురైదురికి అమ్మడం వంటి వాటిలో ఆయనపై దాదాపు 24కు పైగా కేసులు నమోదు కాగా, వాటిలో ఆయన నిందితుడిగా ఉన్నారు. పదుల సంఖ్యలో ఉన్న ఇతని బాధితులు పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టారు. కోర్టుల్లో కేసులు వేశారు. కేసుల నుంచి తప్పించుకోవడానికి పురమల్ల అజ్ఞాతంలోకి వెళ్లిన అనేక సందర్భాలు ఉన్నాయని ఆ పార్టీ వాళ్లే చర్చించుకుంటున్నారు. మేజ ర్ గ్రామం బొమ్మకల్‌కు సర్పంచ్‌గా ఉన్న పురమల్ల శ్రీనివాస్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరి కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఆ పార్టీ నాయకులంతా అవాక్కయ్యారు. అంతే కాకుండా టికెట్ తనకే కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానం వద్ద గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభమైనప్పటికీ కరీంనగర్ టికెట్ విషయంలో ఆ పార్టీ ఇంకా ఎటూ తేల్చుకోలేక పోతున్నది. పురమల్లపై ఉన్న కేసుల వివరాలు, ఆయన చేస్తున్న అక్రమాలను కాంగ్రెస్ అధిష్టానాకి ఇప్పటికే ఆయన బాధితులు సహా కాంగ్రెస్ నాయకులు కూడా ఫిర్యాదు చేశారు. అనేక కేసుల్లో ఆధారాలు కూడా అందించినట్లు తెలుస్తోంది. నిజానికి ఆయన కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న రోజునే.. చాలా మంది కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించా రు. అధిష్టానానికి ఆధారాలతో సహా ఫిర్యాదులు చేశారు. గతంలో ఈయన బాధితులు అనేక సార్లు కరీంనగర్ కలెక్టరేట్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేశారు. ఈ ఆధారాలను కూడా కొందరు కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

### బైండోవర్ రచ్చ

పురమల్ల శ్రీనివాస్‌పై ఉన్న పలు కేసుల నేపథ్యంలో రౌడీ షీట్ ఓపెన్ చేసేందుకు, ఆయనపై పీడీ యాక్ట్ కేసులు పెట్టేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్టు వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ వీడియోను సైతం కాంగ్రెస్ పార్టీలోని కొందరు వ్యక్తులు వైరల్ చేశారని తెలుస్తోంది. అంతేకాదు, సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టును అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా.. మళ్లీ మళ్లీ అదే రిపిట్ చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా.. నేర చరిత్రలో కూరుకుపోయిన పురమల్ల శ్రీనివాస్‌పై పోలీసులు తాజాగా, గురువారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నిజానికి అనేక కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని, ఎన్నికల నేరాలకు పాల్పడిన వారిని పోలీసులు తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేస్తారు. ఈ పరిస్థితుల్లో శ్రీనివాస్ బైండోవర్ విషయం ప్రస్తుతం కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సదరు వ్యక్తి కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందంటూ ఇప్పటికే ప్రచారం చేసుకోవడం, అధిష్టానం కూడా కరీంగనర్ నియోజకవర్గం సీటును తేల్చకుండా నాన్చడం వంటి పలు అంశాలు ఆ పార్టీ వర్గాల్లో పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇలాంటి వ్యక్తికి పార్టీ టికెట్ కేటాయిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. పార్టీ కోసం ముందు నుంచీ అహర్నిషలు కష్ట పడి పనిచేసిన నాయకులను కాదని, ఇటీవల చేరిన, పైగా నేర చరిత్ర ఉన్న పురమల్ల శ్రీనివాస్‌కు అధిష్టానం టికెట్ కేటాయిస్తే పరిస్థితి ఏమిటనే గందరగోళ పరిస్థితిలో ఆ పార్టీ నాయకులు పడ్డారు. కరీంనగర్ కాంగ్రెస్ టికెట్ పురమల్లకు కేటాయిస్తే ప్రజలకు సమాధానం చెప్పలేని స్థితిలో పడిపోతామని ఆ పార్టీలో కొందరు నాయకులు బాహాటంగానే వాదిస్తున్నట్లు తెలుస్తోంది. నేర చరిత్ర కలిగిన వ్యక్తులను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసే విషయం తెలిసినా.. ఒక జాతీయ పార్టీ అలాంటి వ్యక్తులకు అవకాశం కల్పిస్తే ఆ ప్రభావం ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలపై పడుతుందన్న ఆందోళన ఆపార్టీలో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో వాస్తవాలను లోతుగా పరిశీలించి కేసులు నమోదైన వ్యక్తికి టికెట్ కేటాయించి పార్టీ పరువు తీయవద్దని పేర్కొంటూ తాజాగా మరోసారి వారు అధిష్టానానికి ఫిర్యాదు చేశారని సమాచారం. పార్టీ శ్రేణుల విజ్ఞప్తిని కాదని టికెట్ కేటాయిస్తే.. అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు చాలా మంది సిద్ధం అవుతున్నట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.